ఫుట్‌బోర్డ్ ప్రయాణం ప్రమాదం

- బస్సుల చక్రాల కిందపడి మహిళ చెయ్యి నుజ్జునుజ్జు
- ప్రాణాలతో బయటపడి చికిత్స పొందుతున్న మహిళ


కిందపడిపోయిన మల్లీశ్వరి

జగద్గిరిగుట్ట: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బస్సులో నుంచి కిందపడగా ఆమె కుడి చెయ్యి నుజ్జునుజ్జు అయిన సంఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డికాలనీకి చెందిన మల్లీశ్వరి(45) ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ ప్రైవేట్ ఇన్స్‌రెన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్లేందుకు మల్లీశ్వరి అస్‌బెస్టాస్ కాలనీ వద్ద సికింద్రాబాద్ బస్సు (టీఎస్29జెడ్ 1524)ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో మల్లీశ్వరి ఫుట్‌బోర్డుపై నిల్చుని ఉంది. బస్సు బయల్దేరిన క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో మల్లీశ్వరి కిందపడింది. ఆమె కుడి చేతిపై నుంచి బస్సు ముందు చక్రం వెళ్లడంతో చెయ్యి మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మల్లీశ్వరి కుమార్తె నిఖిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

జీడిమెట్ల: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జీడిమెట్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన ఎండీ మోహియుద్దీన్(73) మంగళవారం మధ్యాహ్నం జీడిమెట్ల డీపీకాలనీ వద్ద సూరారం వెళ్లేందుదు సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో వేగంగా వచ్చిన లారీ మోహియుద్దీన్‌ను ఢీకొట్టి అతని రెండు కాళ్లపై నుంచి వెళ్లింది. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అత్యవసర చికిత్స నిమిత్తం పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న మోహియుద్దీన్ సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే వివేకానంద్


స్కందానగర్‌లో కృతజ్ఞత యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలతో ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో దుండిగల్ మండల సీఐటీయూ కన్వీనర్ లింగస్వామి ఆధ్వర్యంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి 17 డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఎంప్లాయ్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో సుమారు 64 వేల మందికి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిస్ మీద ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వారిని పర్మినెంట్ చేయడంతో పాటు వారికి ఫిక్స్‌డే, ఐఆర్‌ను అందజేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అసెంబ్లీ వేదిక కాంట్రాక్ట్ ఉద్యోగుల దుస్థితిని లేవనెత్తుతానని వారికి హామీ ఇచ్చారు. యూనియన్ సభ్యులు ఎల్లయ్య, పెంటయ్య, మధు, సుశీల, బాలయ్య, రవి, జీవేందర్, అమృత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్ పద్మశాలి సంఘం కేలండర్ ఆవిష్కరణ

◆ జగద్గిరిగుట్ట డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, విజయ శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు, పద్మశాలి సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్షులు భోగ రాజేష్, కుత్బుల్లాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బేతి గోపాల్, గౌరవ అధ్యక్షుడు మునిపల్లి జనార్దన్, గౌరవాధ్యక్షులు టి.నరసింగరావు, సలహాదారులు గూడూరి లక్ష్మీ నరసింహులు, సలహాదారులు పల్లె దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ మాయకోటి ప్రభాకర్, జనరల్ సెక్రటరీ రుస్తుంపేట రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

సూరారం డివిజన్‌లో కృతజ్ఞత యాత్ర..

◆ సూరారం కాలనీ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్, స్కందానగర్, శివాలయనగర్, మస్తానా బిల్డర్స్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే వివేకానంద 11వ రోజు కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. తనకు అఖండ విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: వార్షిక విద్యుత్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. వైష్ణవి ఎన్‌క్లేవ్, ఉడ్స్ కాలనీ, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, సెయింట్ ఆన్స్ స్కూల్, డీమార్ట్, కాస్ హోటల్, రెనోవా ఆస్పత్రి, సత్యం ఎన్‌క్లేవ్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం, అంగడిపేట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు..**

కొంపల్లి సెక్షన్ పరిధిలోని ఎన్‌సీఎల్, వెన్‌సాయి, జయభేరి, కొంపల్లి విఘ్నేశ్వర, అపర్ణ, ధోలారీధని, నూజివీడు సీడ్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి ఏఈ తెలిపారు.

◆ **నిజాంపేట్ సెక్షన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 వరకు..**

నిజాంపేట్: నిజాంపేట్, రాజధాని స్కూల్, జర్నలిస్ట్ కాలనీ, భండారి లేఅవుట్, భవ్యాస్, శ్రీనివాస కాలనీ ఫీడర్ల పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, నిజాంపేట్ ప్రధాన రోడ్డు, గ్రీన్ అవెన్యూ, పాలంపల్లి విల్లాస్, భవ్యాస్ ఆనంద్, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, భండారి లేఅవుట్, రెడ్డి ఎవెన్యూ, పాత గ్రామపంచాయతి కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని నిజాంపేట్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ **బౌరంపేట్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 వరకు..**

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో 11కేవీ ఎన్‌రిచ్ బొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్టెర్లింగ్ హోమ్స్, బాలాజీ ఎన్‌క్లేవ్, ప్రణీత్‌జెమ్స్, ప్రణీత్ నేచ్యుర్ బౌంటీ, ఖాజీపల్లి రోడ్డు, స్ప్రింగ్‌వుడ్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ **మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు...**

నిజాంపేట్: బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అపర్ణ, కొకకోలా ఫీడర్ల పరిధిలోని కొకకోలా ఇండస్ట్రీ ఏరియా, తెలంగాణ ఇంజినీర్స్ బిల్డింగ్, డాల్ఫిన్ కన్‌స్ట్రక్షన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ తెలిపారు.

◆ **ప్రగతినగర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు**

పంచవటి ఫీడర్ పరిధిలోని ప్రశాంతి గోల్డ్ హిల్స్, గోదావరి కట్స్, రోసరీ స్కూల్, న్యూవిజేత సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

రైతు బజార్లపై విద్యార్థులకు అవగాహన


పాఠశాలలో ఏర్పాటు చేసిన రైతు బజార్..

జీడిమెట్ల: పట్నంలో చదువుకునే విద్యార్థులకు పల్లెటూర్లలో కష్టపడి పంటను పండించే రైతులు గురించి తెలియజేయాలని సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ సునీత అన్నారు. మంగళవారం పాఠశాలలో రైతు బజార్లపై విద్యార్థుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు రైతు బజార్లను ఏర్పాటు చేసి అక్కడే కూరగాయలు విక్రయించారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు రైతులు పంటలను పండించే విధానాన్ని విద్యార్థులకు చూపించారు. దీంతో పాటు పంటకు అయ్యే పెట్టుబడి రైతు బజార్లలో రైతులకు లభించే ధరలను విద్యార్థులకు తెలిపారు. పాఠశాలలోని అవరణ రైతు బజార్‌ను తలపించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించండి

రాకపోకలకు ఇబ్బందులు తగ్గించండి


గల్లీలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఇనుప రేకుల నిర్మాణం

రంగారెడ్డినగర్: రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని మొదటి గల్లీలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇనుప రేకులతో నిర్మాణాన్ని చేపట్టి సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు. అసలే 15 ఫీట్ల మేర ఉన్న రోడ్డు అక్రమణతో మరింత కుంచించుకుపోయింది. అంతే కాకుండా సదరు గల్లీలో రోడ్డుపైనే మెకానిక్ షెడ్డు నిర్వాహకుడు వాహనాల రిపేర్లను నిర్వహించడం గమనార్హం. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు అక్రమణలను తొలగించి రాకపోకలకు ఆటంకం కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకస్మిక తనిఖీలు

- పైపులైన్ పనులపై హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం ఆరా


పైపులైన్ పనులపై అధికారులతో మాట్లాడుతున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: హెచ్ఎండబ్ల్యూఎస్ సుచిత్ర, జీడిమెట్ల సెక్షన్ల పరిధిలో చేపడుతున్న నాలాల అభివృద్ధి పనులను మంగళవారం కుత్బుల్లాపూర్ హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చింతల్ డీజీఎం రాజేష్, జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ రాజు, సుచిత్ర సెక్షన్ మేనేజర్ శివప్రసాద్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పైపులైన్స్ పనులను పరిశీలించారు. కుత్బుల్లాపూర్ విలేజ్, జీడిమెట్ల పైప్ లైన్ రోడ్డు నేషనల్ హైవేస్ తదితర ప్రాంతాల్లో చేపడుతున్న భారీ పైప్‌లైన్లతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ చేపడుతున్న పనుల్లో భాగంగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని పైపులైన్లలో ఇటీవల లీకేజీలు ఏర్పడ్డాయి. కాగా సదరు పైపులైన్లకు చేపడుతున్న మరమ్మతు పనులను అధికారులతో కలిసి జీఎం పర్యవేక్షించారు.

శుభాకాంక్షలు

చింతల్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలికి ఎమ్మెల్సీగా ఎన్నికై న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఆదివారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులపై గత రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కేసులు నమోదు చేయించిందన్నారు. వాటిని సైతం లెక్క చేయకుండా బల్మూరి వెంకట్ చేపట్టిన పోరాటాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనకు ఎమ్మెల్సీగా గుర్తింపునిచ్చిందని గొల్ల జాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె జీవన్, సాయి కిరణ్, శివ, వేణు, విజయ్, సందీప్, నాగేందర్, అభిలాష, శివసాయి పాల్గొన్నారు.

భాషల వెనుక వ్యవస్థీకృత నిర్మాణం

పద్మశ్రీ అన్వితా అబ్బి

రాయదుర్గం: భాష అనేది విజ్ఞాన భాండాగారమని కెనడాలోని సైమన్ ఫ్రెజర్ యూనివర్సిటీ లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్ పద్మశ్రీ అన్విత అబ్బి తెలిపారు. గచ్చిబౌలి ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చైర్ ఆధ్వర్యంలో 'పర్యావరణ వైవిధ్యం భాష అండ్ సంస్కృతి' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్వితా మాట్లాడారు. భాష అనేది అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికి సహాయపడే సాధనమన్నారు. అన్ని భాషల వెనుక ఒక వ్యవస్థీకృత నిర్మాణం ఉంటుందని తెలిపారు. మనదేశంలో కనీసం 800 నుంచి 1000 భాషలు ఉన్నాయని, ఆయా భాషలలో ఉన్న సంస్కృతి గొప్పదని చెప్పారు. భాషావేత్తలను స్పీచ్ డిటెక్టివ్‌లుగా అభివర్ణించారు. మాతృభాషల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ చాలా మంది పాఠశాలలకు వెళ్లకుండానే సొంత భాషను నేర్చుకోవడం గొప్పవిషయమన్నారు. భాషావేత్తల కృషిని ఈ సందర్భంగా ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభినందించారు. ప్రొ. షగుఫ్తా షాహీన్, రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్, మౌలానా కలామ్ ఆజాద్ చైర్ ప్రొ. సయ్యద్ ఇంతియాజ్ హస్నైన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

నేతాజీ.. యువతకు స్ఫూర్తి

కుత్బుల్లాపూర్: ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీషర్లను గడగడలాడించిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. నేతాజీ జయంతిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా పాఠశాలల్లో నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు నేతాజీ వేషధారణలో సందడి చేశారు.


సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో..

హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌ల చోరీలు.. క్యాషిఫై యాప్‌లో విక్రయాలు

- ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- మరో నిందితుడి గురించి గాలిస్తున్నామని వెల్లడి


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

దుండిగల్: జల్సాలకు అలవాటు పడిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ల్యాప్‌టాప్‌లను దొంగలించి క్యాషిఫై యాప్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం దుండిగల్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడితో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 20 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

◆ గాజులరామారం, భవానీనగర్‌కు చెందిన అపాల బాలాజీ(20) ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. జల్సాల కోసం దొంగతనాలు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ప్రైవేటు హాస్టళ్లలో సెక్యూరిటీ తక్కువగా ఉంటుందని గుర్తించాడు. మెడలో కళాశాల ఐడీకార్డు, బ్యాగ్‌తో హాస్టల్‌లో తన స్నేహితుడు ఉన్నాడని చెప్పి లోపలికి వెళ్లేవాడు. తాళం వేసిన గదులు పగలగొట్టడం, ఖాళీగా ఉన్న గదుల్లో ల్యాప్‌టాప్‌లను దొంగలించేవాడు.

◆ ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ ఖుష్వా(20) నగరానికి వలస వచ్చి హిమాయత్‌నగర్, అడ్వకేట్స్ కాలనీలో ఉంటున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పర్వేజ్ కుమార్ సలహా మేరకు ×క్యాషిఫై× యాప్‌లో పికప్ ఏజెంట్‌గా చేరాడు. అదే యాప్‌లో పర్వేజ్ డీలర్‌గా పని చేస్తున్నాడు. ఈ ×క్యాషి ఫై×యాప్‌లో బిల్లులు లేకుండానే ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల క్రయ విక్రయాలు చేయవచ్చు.

◆ బాలాజీ మొదటి సారి ఓ ల్యాప్‌టాప్‌ను యాప్‌లో విక్రయించగా అప్పటి నుంచి రాజ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో గండిమైసమ్మ చౌరస్తా పరిసర ప్రాంతాల్లోని హాస్టళ్లలో బాలాజీ ల్యాప్‌టాప్‌లు చోరీ చేసి రాజ్‌కుమార్‌కు విక్రయించాడు. చోరీల విషయంపై దుండిగల్ పోలీసులకు ఫిర్యాదులు రావడంతో నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీ మంగళవారం గండిమైసమ్మ చౌరస్తాలో అనుమానస్పదంగా తచ్చాడుతుండగా బాలానగర్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అతడిని పట్టుకున్నారు.

◆ అతడు ఇచ్చిన సమాచారం మేరకు హిమాయత్‌నగర్‌లో రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 20 ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు, హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పర్వేజ్ కుమార్ పరారీలో ఉన్నాడు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ డీఐ శ్రీనివాస్, ఎస్ఓటీ సీఐ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

దుండిగల్: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలను పెంచాలని సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ లింగస్వామి అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ.. ప్రతి నెల ఆరోగ్య పరికరాలు ఇవ్వాలన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25 లక్షల ఇన్సురెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని పేర్కొన్నారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్యం, నరసింహ, ఎల్లయ్య, సురేందర్, పెంటేష్, మధు, రవి, జగన్, అమృత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే విధంగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని సాయి బాలాజీ కాలనీ, 21వ వార్డుల్లో రూ.46 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కలిపిస్తామన్నారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి ముదిరాజ్, మాదాసు వెంకటేశం, ఎంబరి లక్ష్మి, నాయకులు ఎంబరి ఆంజనేయులు, హనుమంత్‌రావు, అమర్‌నాథ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఎమ్మెల్సీ పూజలు



కుత్బుల్లాపూర్: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దర్శించుకున్నారు. మేడ్చల్ జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కొలుకుని కోరుకున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, పోలీస్ గోవింద్‌రెడ్డి, సాయి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


నవదుర్గా వేషధారణలో చిన్నారుల నృత్య ప్రదర్శన


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- ఈనెల 26 వరకు పూజలు
- 27వ తేదీన అన్నదానం


విద్యుత్ దీపకాంతులతో గాజులరామారం చిత్తారమ్మ ఆలయం

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారికి దర్శించుకునేందుకు క్యూ కట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు నవదుర్గల వేషధారణలో చేసిన నృత్య ప్రదర్శనతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. విద్యుత్ వెలుగులతో ఆలయం దేదీప్యమాన్యంగా వెలిగిపోయింది. ఈనెల 26వ తేదీ వరకు అమ్మవారికి కుంకుమార్చనలు కొనసాగుతాయని, జాతర చివరి రోజు 27న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్‌రెడ్డి

సుభాష్‌నగర్: మద్యం మత్తులో ఓ బైకిస్ట్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన భాస్కర్‌రెడ్డి(23) ఓ ఫార్మా పరిశ్రమలో టెస్టింగ్ ఇంజినీర్‌గా పని చేస్తూ సూరారంలోని మేఘన హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి స్నేహితులతో పార్టీ చేసుకున్న భాస్కర్‌రెడ్డి మద్యం మత్తులో రాత్రి 2 గంటల ప్రాంతంలో గండిమైసమ్మకు బైక్‌పై బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 2.30 గంటల ప్రాంతంలో కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డి తలకు, కుడి కాలికి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు శిక్ష

ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా

జగద్గిరిగుట్ట: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్–మల్కాజ్‌గిరి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌కు చెందిన చింతల సత్యనారాయణ అలియాస్ సతీష్(36), స్వప్నతో 2011లో వివాహం అయ్యింది. వీరికి జశ్వంత్, గౌతమ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహ సమయంలో రూ.80వేల నగదుతో పాటు 30 గ్రాముల బంగారు నగలు, ఇంటి సామాను తదితర పెళ్లికానుకలు ఇచ్చారు. కొన్ని రోజుల పాటు సజావుగా వీరి కాపురం కొనసాగింది. అదనపు కట్నం కోసం అత్తింతి వారి వేధింపులు మొదలయ్యాయి.

◆ మానసికంగా, శారీరకంగా వేధింపులు తీవ్రతరం కావడంతో తట్టుకోలేకపోయిన స్వప్న జులై 2, 2016లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పట్లో జగద్గిరిగుట్ట పోలీసులు మృతురాలి భర్త సత్యనారాయణతో పాటు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లిలోని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా సెషన్స్ కోర్టులో ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు తుది తీర్పును వెలువరించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపారు.